క్లుప్తంగా

యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దు



చినకొత్తలంకలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై జ్వాలాసాగర్, గ్రామస్తులు

ముమ్మిడివరం: యువత మత్తు పదార్థాల జోలికి పోకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై డి.జ్వాలాసాగర్ సూచించారు. చినకొత్తలంకలో కమ్యూనిటీ భవనంలో మంగళవారం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను పర్యవేక్షించాలన్నారు. యువత అప్రమత్తంగా ఉంటూ గంజాయి ఉత్పత్తి, రవాణను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. మత్తు పదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నాయకులు పి.మల్లికార్జునవర్మ, మహిళా పోలీసు బి.రూప, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు హర్షణీయం



అమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా బీజేపీ నాయకులు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మధ్య తరగతి, సామాన్య ప్రజలకు వరంగా జీఎస్టీ సదుపాయాలను కల్పించారని జిల్లా బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో అమలాపురంలో ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలతో కూడిన ప్ల కార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ పాదయాత్ర నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ ప్రసంగించి జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్య ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.

వీధి వ్యాపారులకు ఆసరాగా 'పీఎం స్వనిధి యోజన'

ముమ్మిడివరం: వీధి వ్యాపారులకు ఆసరాగా ఉండే పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. లోక్ కల్యాణ్ మేళాలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో బ్యాంకర్లు, వీధి వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు కమిషనర్ రవివర్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ పథకం ద్వారా బ్యాంకర్ల నుంచి రుణ సదుపాయం పొంది ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

వెంకన్న దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి స్థానిక దేవస్థానంలో స్వామి సన్నిధిలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కంచిపల్లి అబ్బులు, ధర్మకర్తలుగా దంగేటి విజయగౌరి, కొమ్ముల ఆదిబాబు, మట్టపర్తి గౌరీపార్వతి, వెన్నా మాణిక్యాంబ, మోకా కల్యాణి దుర్గ మాణిక్యాంబ, కుంచే అరుణకుమారి, కాలేపల్లి ప్రసాద్, పెద్దింటి లక్ష్మీ నరసింహాచార్యులు తదితరులు ప్రమాణం స్వీకారం చేశారు. నూతన ధర్మకర్తల మండలి ప్రతినిధులతో దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

యానాం: ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టం తదితర అంశాలపై మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ బాలికల హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు మాట్లాడుతూ బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గూర్చి వివరించారు. బాలలహక్కులు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో అధిక చార్జీలపై కఠిన చర్యలు

అమలాపురం రూరల్: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల బలహీనతను ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం డీటీఓ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 388 ప్రైవేట్ బస్సులను తనిఖీ చేసి రూ.33,33,550 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామని ప్రతి వారం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు, రహదారి భద్రతా ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదని డీటీఓ తెలిపారు. బస్సులను మితిమీరిన వేగంతో నడుపవద్దని, డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

ఈ-పంటకు ఏదీ భరోసా?

- ఆగస్టు 14తో ముగిసిన పంటల బీమా గడువు
- కౌలు రైతులు, రుణాలు అందని రైతులకు లేనట్టేనా !
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు
- మొండిచేయి చూపుతున్న కూటమి సర్కార్



భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

అల్లవరం: ఒక దేశం.. ఒక పంట.. ఓ ప్రీమియం నినాదంలో కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన క్షేత్ర స్థాయిలో నీరుగారుతోంది. పంట వేసే ప్రతి రైతుకు ఈ పథకం ద్వారా పంటలకు బీమా కల్పించి, రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, వరదలు, తెగుళ్ల నుంచి పంటలు దెబ్బతింటే.. రైతుల నష్టపోకుండా బీమా సంస్థల నుంచి పరిహారాన్ని రైతులకు ఇప్పించి, వారి ఉత్పాదక శక్తి పెంపొందేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆ దిశగా వ్యవసాయ రంగాన్ని సఫలీకృతం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన లోపం.. అందని బీమా

అమలాపురం నియోజకవర్గంలో తీర ప్రాంతాలైన అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో అధిక వర్షాలతో ప్రతి ఏటా వందలాది ఎకరాల్లో వరి పంట నష్టం జరుగుతోంది. ఖరీఫ్‌లో తుపాన్ల ప్రభావంతో పంటలు పాడవుతుంటే, దాళ్వాలో అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అధిక శాతం రైతులకు పంట బీమాపై సంపూర్ణ అవగాహన లేదు. పంట బీమాకు ప్రీమియం ఎంత చెల్లించాలి, ఎప్పుడు చెల్లించాలనే దానిపై కనీస అవగాహన లేదు. జూన్ నుంచి ఆగస్టు 14 వరకు బీమా ప్రీమియం చెల్లించడానికి అవకాశం కల్పించారు. బ్యాంకులు, సొసైటీల్లో పంట రుణాలు తీసుకునే రైతులకు ఎకరానికి రూ.76 చొప్పున వారి బ్యాంక్ ఖాతాల నుంచి నేరుగా ప్రీమియం వసూలు చేస్తున్నారు. కౌలు రైతులు, పంట రుణాలు తీసుకోని రైతులు బీమా ప్రీమియం చెల్లించడం లేదు. పంట రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు మీ-సేవా కేంద్రాల్లో పంట బీమాకు ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. ఆ దిశగా వ్యవసాయ శాఖ కౌలు రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్‌లో వరి సాగు ఎకరాల్లో

మండలం	విస్తీర్ణం	రైతులు	ఈ-పంట నమోదు
అల్లవరం	2,340	2,100	2,340
ఉప్పలగుప్తం	4,560	3,870	2,650
అమలాపురం రూరల్	4,670	3,660	3,800

ఉచితంగానే పంట బీమా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు పెద్ద పీట వేసింది. రైతులకు ఆర్థిక భారం లేకుండా మొత్తం ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించింది. అంతేకాకుండా సీసీఆర్‌సీ కార్డు ఉన్న ప్రతి కౌలు రైతులకు పంటల బీమాను ఉచితంగాను, పంట రుణాలు తీసుకోని వారికి కేవలం ఒక రూపాయి చెల్లింపుతో పంట బీమాను అందించింది. అధికారంలో ఉన్న ఐదేళ్లు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతు పక్షపాతిగా నిలిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత పంటల బీమాను పూర్తిగా తుంగలోకి తొక్కింది. కనీసం బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టలేదు. కౌలు రైతులకు, పంట రుణాలు తీసుకోని వారికి కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపింది.

బీమా ప్రీమియం ఎగ్గొట్టింది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ-పంట నమోదైన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటను యధాతథంగా కొనసాగించి, రెండో పంట నుంచి ఎకరానికి రూ.76 ప్రీమియం రైతులే చెల్లించుకోవాలని నిర్ణయించింది. దీంతో చాలా మంది రైతులకు అవగాహన లేక బీమా ప్రీమియం చెల్లించలేకపోయారు. కౌలు రైతులు, పంట రుణాలు తీసుకోని రైతులు పంట బీమా ప్రీమియం చెల్లించలేదు.

– జున్నూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, ఉప్పలగుప్తం

సమన్వయంతో దసరా ఊరేగింపు



అమలాపురం దసరా ఉత్సవాల నిర్వహణపై సూచనలిస్తున్న ఆర్డీవో మాధవి

అమలాపురం టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా అమలాపురంలో ప్రాచీన చెడీ తాలింఖానా ప్రదర్శనలు, ఊరేగింపును కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య శాంతిసామరస్యంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో కొత్త మాధవి పలు ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. అమలాపురంలో దసరా ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే ఏడు వీధుల ఉత్సవ, శాంతి కమిటీల ప్రతినిధులు, పలు శాఖల అధికారులతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాధవి మాట్లాడారు. దసరా ఉత్సవాలు నిర్వహించే ఏడు వీధుల్లో ఏడు డ్రోన్ కెమెరాలు వినియోగించి వాటిని అమలాపురం గడియారం స్తంభం వద్ద పోలీస్ శాఖ ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి మొత్తం ఊరేగింపు ప్రక్రియను పర్యవేక్షించాలని పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్‌ను ఆదేశించారు. ప్రధానంగా ఏడు వీధుల ఉత్సవ విగ్రహ వాహనాలు వెళ్లే మార్గాల్లో ఏమైనా అడ్డంకులుంటే వాటిని అధికారుల దృష్టికి ముందుగానే తీసుకువస్తే పరిష్కరిస్తారన్నారు. ఊరేగింపుల్లో సామాజిక ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు ఆర్డీవో సూచించారు. ఏడు వీధుల్లో మహిపాలవీధి, కొంకాపల్లి తదితర వీధులకు చెడీ తాలింఖానా యుద్ధ కళల ప్రదర్శనలకు ఘన చరిత్ర ఉండడంతో ఆ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖల అధికారులు ఊరేగింపులను పక్బడందీగా నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌తో పాటు విద్యుత్, వైద్య ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల డివిజన్ అధికారులు పాల్గొన్నారు. ఏడు వీధులు ఉత్సవ కమిటీల పెద్దలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మహోత్సవాలు



గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహాన్ని గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అన్నారు. కొమరగిరిపట్నం మిలటరీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలపల్లిలో వైద్య శిబిరం

తాళ్లరేవు: ప్రధాన మంత్రి స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నీలపల్లి పంచాయతీలో నిర్వహించారు. నీలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ చిట్టూరి నాగమణి ప్రారంభించారు. వైద్యుడు ఈశ్వర్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ బీఎల్‌జీ కుమార్, హెచ్‌వీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మెర్సీ, ఏఎన్‌ఎంలు స్వాతి, పద్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో వైద్య శిబిరం

అమలాపురం రూరల్: రెడ్డిపల్లిలో స్వస్థ్ నారీ-స్వశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వైద్యులు అమృత, అన్నామణి క్యాన్సర్, బీపీ, సుగర్, వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కరరావు, వెంకటేశ్వర కళాశాల కరస్పాండెంట్ , కేవీఆర్ఎన్ నరసింహారావు.ప్రిన్సిపల్ కె.మనోహర్, ఎంపీటీసీ సత్తి ఆదిలక్ష్మి, కార్యదర్శి గణపతి, పీఏసీ డైరెక్టర్ కొలిశెట్టి జయప్రకాష్, నల్లా సతీష్. వీఆర్వో గంధం దొరబాబు, విద్యా కమిటీ చైర్మన్ సమనస రాంబాబు, వీర వేణి,హేమ విజిత తదితరులు పాల్గొన్నారు.

పలువురు రక్తదానం

ఐ.పోలవరం: స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టి.కొత్తపల్లి సీహెచ్‌సీలో పలువురు రక్తదానం చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో అమలాపురం ఏరియా ఆస్పత్రి పరిధిలోని బ్లడ్ సెంటరు ఆధ్వర్యంలో మంగళవారం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 22 మంది రక్తదానం చేశారు.

ట్యాంకుల నిర్మాణాన్ని పూర్తి చేయాలి



కలెక్టర్‌కు వినితిపత్రం అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

అమలాపురం రూరల్: అసంపూర్తిగా నిలిచిపోయిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలను పూర్తి చేయించి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని అమలాపురం రూరల్ మండలం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి కోరారు. అమలాపురం మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు మంగళవారం కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ను కలిశారు. గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. చాలా ట్యాంకులు 75 శాతం పనులు పూర్తయ్యాయని మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఆక్వా చెరువులు, ఓఎన్జీసీ కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని కలెక్టర్‌కు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు రక్షిత మంచినీరందించాలని కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. వైస్‌ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్‌లు చెల్లుబోయిన నాని, గుత్తుల చిరంజీవిరావు, దాసరి అరుణ, గంగమళ్ల ఏసుబాబు, పరమట శ్యామ్‌కుమార్, రేలంగి దుర్గారావు, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బారామ్, వాసంశెట్టి శ్రీను, దొంగ అంజీనీయులు, రేవు శ్రీను. అంకం హిమ భారతి, నక్కాచంద్రశేఖర్, కరాటం ప్రవీణ్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

శాయ్ క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన శాయ్ క్రీడాకారులు

యానాం: కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) అకాడమీ యానాం శాఖ క్రీడాకారులు ఇటీవల నిర్వహించిన 9వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడరన్ పెంథాలన్ బైథిల్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పతకాలు సాధించారని మంగళవారం ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అండర్ -17లో కోలాటి సతీష్‌కుమార్, అండర్-15లో వి.వెంకటనాగ సాయి, పి.నిషాంత్, పి.నమ్రత బంగారు పతకాలు, కె.వీరబాబు రజత పతకం సాధించారు. అండర్-13లో జీఎల్ఎస్ హర్ష, ఎమ్ వల్లీకాశ్రీజ బంగారు పతకాలు, ఎస్ అభిషిక్త్ రజత పతకం సాధించారు, అండర్-11లో వి.ప్రజ్ఞ బంగారు, ఎస్ హేమవర్షిణి రజత పతకం సాధించారు. అండర్-9లో ఎస్ మృద్వికవర్షిణి బంగారు పతకం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ రవితేజ గ్రంధి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎస్‌కేబీఆర్ విద్యార్థిని



రాష్ట్రస్థాయికి ఎంపికైన రమ్యను అభినందిస్తున్న కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు, సుబ్బరాజు

అమలాపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఇంటర్ విద్యార్థిని మంగం రమ్య రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు తెలిపారు.ఈ పోటీలు ఇటీవల గొల్లల మామిడాడలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్ 17 పోటీల్లో రమ్య అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని సుబ్బారావు తెలిపారు. రమ్యను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి సుబ్బరాజు, తాతా అవధాని, సభ్యులు, పరిపాలనాధికారి, పీడీ సురేష్,అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: వీరేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం భక్తుడు విరాళం అందించారు. బెంగళూరుకు చెందిన శ్రీ రమ్య రాకేష్ రూ.10,001 ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అర్చకులు శేష వస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు అహోరాత్ర పారాయణం : మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా లోక కల్యాణార్థం బుధవారం నుంచి అహోరాత్ర లలిత సహస్రనామ పారాయణ నిర్వహించనున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని స్థానిక లలిత మహిళా భక్త మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని ఆలయ అధికారులు తెలిపారు.

గాయత్రీదేవి అలంకరణలో దుర్గమ్మ

అమలాపురం టౌన్: దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమలాపురం పట్టణంలోని శ్రీదేవి అమ్మ వారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులు సేవలందించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వైష్ణవీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా, స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక కల్వకొలనువీధిలోని వేప చెట్టు కనక దుర్గ ఆలయం వద్ద శత చండీ సహిత రుద్రయాగం వైభవంగా నిర్వహించారు.

అమలాపురం రూరల్: ఈదరపల్లి వంతెన వద్ద కొలువైన దుర్గా భవానీ అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. మంగళవారం అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి కుంకుమార్చన

ఉప్పలగుప్తం: దసరా ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. సన్నవిల్లి గ్రామ పంచాయితీ పరిధి దుర్గానగర్‌లో గాయత్రి దేవిని అలంకరణ ప్రత్యేకంగా అలంకరించారు.



గ్రాంటు గ్రామంలో పాల కనకదుర్గమ్మ ఆలయంలో బాలపూజ

పాల కనకదుర్గమ్మ ఆలయంలో బాలపూజ

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో యానాం-గిరియాంపేట రహదారి చెంతన వేంచేసియున్న పాల కనకదుర్గమ్మ ఆలయంలో మంగళవారం బాలపూజను వైభవంగా నిర్వహించారు. గ్రాంటు గ్రామంలో పాల కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో బాలికను బాలాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు.

గాయత్రీదేవిగా అమ్మవారు

ముమ్మిడివరం: దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని మంగళవారం గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్డు, రాజుపాలెం, గోదశివారిపాలెం, క్రాపచింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, చినకొత్తలంక, పల్లవారిపాలెం, లక్ష్మీదేవి లంక, మార్కెట్ సెంటర్ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గాయత్రీదేవిగా అమలాపురం శ్రీదేవి అమ్మవారు



సన్నవిల్లిలో గాయత్రీదేవి అలంకరణలో దుర్గమ్మ

లలితాదేవి అమ్మవారికి పూజలు

యానాం: స్థానిక పడవలరేవు వీధిలో కొలువైన శ్రీలలితాదేవి అమ్మవారు కౌమారీదేవి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో లలితాదేవి భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ఐ.పోలవరం: దేవీ నవరాత్రుల్లో భాగంగా మురమళ్ల భద్రకాళీ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. వీరేశ్వరస్వామి ఆలయంలోని భద్రకాళీ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



సమావేశంలో మాట్లాడుతున్న నకుల రాజు

అమలాపురం రూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు నకుల రాజు డిమాండ్ చేశారు. ఏపీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గ సమావేశం అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్‌లో సంఘం అధ్యక్షుడు నకుల రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడంతో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, పేద ప్రజలకు వైద్య సహాయం ఖర్చుతో కూడుకుంటుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అండతో భూఆక్రమణ దారుణం

తాళ్లరేవు: తాత ముత్తాతల కాలం నుంచి ఉన్న పూర్వాస్తిని కొందరు అధికారుల సహాయంతో ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తల్లీ కొడుకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని జార్జిపేటకు చెందిన దంగేటి మహాలక్ష్మి, ఆమె కుమారులు దంగేటి నీలాద్రి, నాగ దుర్గాప్రసాద్ మంగళవారం నిర్వహించిన సమావేశంలో తమ సమస్యను వివరించారు. జార్జిపేట-పోలేకుర్రు సరిహద్దులో సర్వే నంబరు 5-1లో తమకు గల 16 సెంట్ల భూమిలో రెండు సెంట్ల భూమిని రహదారిపేరుతో ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వారన్నారు. అధికారులను తప్పు దారిపట్టించి తమ భూమిని కబ్జా చేయాలని పిల్లి భాస్కరరావు, గుత్తుల సత్యనారాయణ తదితరులు చూస్తున్నారని ఆరోపించారు. 1932లో కొనుగోలు చేసి పక్కా డాక్యుమెంట్లు ఉన్న భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఈ సమస్యపై కోర్టును ఆశ్రయించామని తెలిపారు. దీనిపై తహసీల్దార్ పితాని త్రినాథరావును వివరణ కోరగా గ్రామానికి చెందిన కొందరు తమకు దారి సౌకర్యం లేదని, కలెక్టర్‌కు విన్నవించారని, ఆ చర్యల్లో భాగంగా ఖాళీ చేయిస్తున్నట్లు తెలిపారు. ఆ స్థలానికి సంబంధించి పూర్తిస్థాయి డాక్యుమెంట్లు, కోర్టు ఆర్డర్‌ను చూపించలేదని, అందువల్లే స్థలం ఖాళీ చేయాలని దండోరా వేయించినట్లు తహసీల్దార్ త్రినాథరావు తెలిపారు.

ఆటో బోల్తా .. తప్పిన ప్రమాదం

అమలాపురం రూరల్: సమనస పంచాయతీ పరిధిలో విలసవిల్లి తూము వద్ద పంట కాలువ వద్ద ఆటో బోల్తా పడింది. ఆటోలో నాలుగు నెలలు చిన్నారితో పాటు తల్లి ప్రయాణం చేస్తోంది. స్థానికులు తల్లి, చిన్నారిని క్షేమంగా బయటకు తీసుకుని వచ్చి రక్షించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. ఆటో అదుపు తప్పడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఆకతాయిల దాడులపై డీఆర్వో విచారణ

ఐ.పోలవరం: టి.కొత్తపల్లి పీహెచ్‌సీ వద్ద ఆకతాయిలు, అపరిచిత వ్యక్తులు మద్యం సేవించి హల్‌చల్ చేస్తూ వైద్య సిబ్బందిపై దాడి చేయడం వంటి ఘటనలపై జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి విచారణ నిర్వహించారు. ఆకతాయిల దాడులను నిరసిస్తూ సోమవారం పీహెచ్‌సీ వద్ద బాధితులు ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో డీఆర్వో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తమపై జరుగుతున్న దాడులను వివరించారు. మండల తహసీల్దార్ ఎం.విజయశ్రీ, ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్ కుమార్, స్థానిక ఎస్సై రవీంద్రరావు పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టుల కేటాయింపులో న్యాయం చేయాలి



ఎల్జీ కైలాషనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: విద్యుత్ శాఖ విడుదల చేసిన కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టుల కేటాయింపులో యానాం రీజియన్‌కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని ఎల్జీ కైలాషనాథన్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో ఎల్జీ కైలాషనాథన్‌ను ఆయన కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి వ్యాప్తంగా సర్వేయర్ పోస్టుల్లో అభ్యర్థులకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, నూతన రిక్రూట్‌మెంట్ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. దరియాలతిప్ప ఐలాండ్ -3 సమీపంలో గోదావరిలో ఇటీవలి ఓఎన్జీసీ పైపులైను లీకేజీ ఘటనలో బాధితులకు న్యాయం చేయాలన్నారు. విధులకు గైర్హాజరవుతున్న యానాం అగ్రికల్చర్ డీడీ శివసుబ్రహ్మణ్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి

ఉప్పలగుప్తం: శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎస్పీ రాహుల్ మీనా పోలీస్ సిబ్బందికి సూచించారు. ఉప్పలగుప్తం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, ముందస్తు సమాచారాన్ని సేకరించి తెలియజేయాలని ఎస్సై రాజేష్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్‌ఏఓ ఆకస్మిక తనిఖీ

యానాం: జిప్‌మెర్ ప్రభుత్వ ఆసుపత్రితోపాటు పలు ప్రభుత్వశాఖలను మంగళవారం ఆర్‌ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. జిప్‌మెర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం వివరాలను ప్రధానవైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఐటీఐతోపాటు సమీపంలోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. మెట్టకూరు శ్మశాన వాటికను పరిశీలించి మౌలిక సౌకర్యాల కల్పనపై అధికారులతో మాట్లాడారు.